క్లుప్తంగా

సరమ్మ అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

లింగపాలెం: లింగపాలెంలో వేంచేసియున్న సరమ్మ పేరంటాల ఉత్సవాల్లో భాగంగా చింతలపూడి నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు, దాత, మైత్రి డెవలపర్స్ అధినేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి), ప్రసన్న కుమారి దంపతులు శ్రీసరమ్మ అమ్మవారికి శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, గోలి సత్యన్నారాయణరెడ్డి (చిట్టిబాబు) సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు కేజీ వెండి అందజేత



దాతలను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మ కుమారి దంపతుల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో, విశేష హారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మిర్తిపాటి శ్రీనివాస్‌శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విజయవాడకు చెందిన డాక్టర్ తమ్మ శ్రీరామ్, డాక్టర్ తమ్మ ఇంద్రాణి అమ్మవారికి వెండి చీర పూర్వక పాదపీఠం సింహాసనం నిమిత్తం అమ్మవారికి కేజీ వెండి సమర్పించినట్లు బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. దాతలను ఘనంగా సత్కరించారు. ఆధ్యాత్మిక వేత్త ధన కుమార్, చోడవరపు రంగా బ్రహ్మం, పెయింట్ శీను, దువ్వ రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ముస్లింలకు గుర్తింపు



దిప్పకాయలపాడులో నాగూర్‌ను సత్కరిస్తున్న ముస్లిం యూత్ నాయకులు

కొయ్యలగూడెం: ముస్లింలకు గుర్తింపునిచ్చింది నాడు మహానేత వైఎస్సార్ అయితే నేడు యువనేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మదీనా మస్జిద్ మత పెద్దలు అన్నారు. శుక్రవారం దిప్పకాయలపాడు మస్జిద్ వద్ద వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ మండల కన్వీనర్‌గా గ్రామవాసి ఎస్‌కే నాగూర్‌ను నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌కే మీర్జా, ఎస్‌కే మీరావల్లి, ఎస్‌కే అజీజ్ బాష, ఎస్‌కే ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

పెదవేగి :లక్ష్మీపురం పంచాయతీ దిబ్బగూడెంలోని కొబ్బరితోటలో కొబ్బరి బొండాల చోరీపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కొప్పులవారిగూడెంకు చెందిన రైతు ముసునూరు ప్రసాద్‌కు చెందిన కొబ్బరితోటలో ఈ నెల 27న సొంగా కాసులు, ఎర్ర సుబ్బారావు, మరికొంత మంది అక్రమంగా ప్రవేశించి కొబ్బరి బొండాలను కోసుకుపోయారు. రైతు ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిత్యావసరాల అందజేత

పెదవేగి : పెదవేగికి చెందిన కందుల శివయ్య కొన్ని రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన భార్య శివరాటాలు ఆర్థిక ఇబ్బందులతో తన తల్లి దగ్గరే ఉండి తన బిడ్డలను పోషించుకుంటోంది. శివరాటాలు కుటుంబానికి చేయూత సంస్థ ద్వారా రూ.10వేలు ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యావసర సరుకులను టీం సభ్యులు శుక్రవారం అందజేశారు. ఇప్పటి వరకు చేయూత సంస్థ ద్వారా 97 నెలలుగా 97 కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందించినట్టు చేయూత సంస్థ సభ్యులు తెలిపారు.

సోమవరప్పాడులో బ్రహ్మోత్సవాలు

దెందులూరు: సోమవరప్పాడులోని జనార్దన స్వామి, శ్రీదేవి,భూదేవి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల నిర్వాహకులు చలసాని శ్రీధర్ దంపతులు, సోమవరప్పాడు గ్రామ నాయకులు మాగంటి వీరేంద్రప్రసాద్ (బబ్బు) దంపతులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.



ధర్మాజీగూడెంలో శిలువను మోస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.విజయరాజు



చింతలపూడిలో శిలువతో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు



దర్భగూడెంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



కొత్తూరులో శిలువ యాత్ర నిర్వహిస్తున్న విశ్వాసులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

చింతలపూడి: చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు చోట్ల శిలువను మోస్తూ ప్రదర్శనలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చింతలపూడిలో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి బోయగూడెం ఆర్‌సీఎం చర్చి వరకూ క్రైస్తవులు ప్రదర్శన చేశారు. ముందుగా నిర్దేశించుకున్న 14 ప్రదేశాల్లో (శిలువ మార్గం) ఆగి మోకాళ్ళపై మోకరిల్లి రోడ్డుపై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రోమన్ కేథలిక్ మిషన్ ఫాదర్ కామా మాథ్యూ మహా పవిత్ర శిలువ యాత్రను ప్రారంభించారు. క్రైస్తవ భక్తులు, రోమన్ కేథలిక్ మిషన్ విశ్వాసులు పాపాల విముక్తి కొరకు శిలువ పాటలను ధ్యానిస్తూ, సువార్త గీతాలను ఆలపిస్తూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. తదుపరి దివ్య పూజాబలి నిర్వహించారు. మండలంలో ఇతర గ్రామాల్లో కూడ క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఉపదేశికులు, వివిధ గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో శిలువ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు

క్రైస్తవులకు శీతల పానీయాలు పంపిణీ

చింతలపూడి: చింతలపూడిలో ముస్లింలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారు. గుడ్ ఫ్రైడే రోజు క్రైస్తవ భక్తులకు శీతల పానీయాలు పంపిణీ చేసి సర్వమతాలు ఒక్కటేనని చాటారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం మండుటెండలో శిలువ యాత్ర చేస్తున్న క్రైస్తవులకు జామియ మస్జిద్ కమిటీ అధ్యక్షులు ఎస్‌డీ రహీం (బాబు), కార్యదర్శి ఎండీ జిలాని, జమాతె ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కే హుస్సేన్, ఎండీ అక్బర్ అలీ, ఎస్‌కే ఆజాద్ బాబు నేతృత్వంలో సుమారు రెండు వేల మంది క్రైస్తవులకు కూల్ డ్రింక్స్ అందజేశారు. సయ్యద్ ఖాజా, హాజీ, రజాక్, నవాబ్, ఇమ్రాన్, భక్షు, రఫీ, రబ్బానీ, బాషు, ముజాహిద్, ఇషాక్, ఆబిద్, అస్లాం పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

లింగపాలెం: ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో శుక్రవారం శిలువ యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లావారిగూడెం, ధర్మాజీగూడెం ఆర్‌సీఎం చర్చిల వద్ద నుంచి ఏసు శిలువ యాత్రను నిర్వహించి భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రదర్శనగా భోగోలు గట్టుపై ఉన్న ఏసుక్రీస్తు శిలువ వద్దకు విశ్వాసులు, మాలధారులు వెళ్లి ఉపవాసంతో కూడిన ఆరాధన నిర్వహించారు. అనంతరం కె.విజయరాజు, వైఎస్సార్ సీపీ నేతలు ధర్మాజీగూడెంలో శిలువ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ మానవాళిని ఉద్ధరించడానికే ఏసుక్రీస్తు జన్మించారన్నారు. క్రీస్తు ప్రపంచ వ్యాప్తంగా శాంతి సమాధానంతోపాటు, ఐక్యతను చాటారన్నారు. ధర్మాజీగూడెం విచారణ గురువులు ఆనంద్ కుమార్, మతబోధకులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. విజయరాజు వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ నూతలపాటి శ్రీను, నాయకులు మొరంపూడి జగన్, కొత్తూరి రమేష్, చల్లా గంగాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా శిలువ యాత్రలు

కామవరపుకోట: కర్మేల్ మినిస్ట్రీ సంస్థ వ్యవస్థాపకులు దిరిసిన మోజేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కొత్తూరు గ్రామంలో సువార్త యాత్ర నిర్వహించారు. స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ విచారణ గురువులు ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించారు. ఏలూరు పీఠం వైస్ జనరల్, ఫాదర్ బాల ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ శిలువ యాత్రను ప్రారంభించారు. పాతూరు నుంచి చౌతన సెంటర్, దుర్గమహల్, చెక్‌పోస్ట్ సెంటర్ మీదుగా, బస్టాండ్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సిలువ యాత్ర నిర్వహించారు. ఈ సదర్భంగా ఫాదర్ పీటర్ ప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపులను రక్షించటానికి సిలువ వేయబడి మరణించి, పునరుత్థానుడై మూడో రోజు, సమాధి నుంచి సజీవంగా బయటకు వచ్చారని, ఏసు శిలువ శ్రమలను గుర్తు చేసుకుని ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే స్మరణ చేసుకుంటారన్నారు. గ్రామస్తులు సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రార్థనలు చేస్తూ.. భక్తిగీతాలు ఆలపిస్తూ..

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పట్టణ ప్రధాన రోడ్డు మీదుగా ఆర్‌సీఎం చర్చి వరకు యాత్ర కొనసాగింది. ఫాదర్ కల్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్రలో క్రైస్తవులు భక్తిగీతాలు ఆలపిస్తూ ప్రార్థనలు చేస్తూ క్రీస్తు శిలువ శ్రమల పాటలను స్మరించారు. అనంతరం చర్చి ఆవరణలో క్రీస్తు శిలువపై మరణించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఫాదర్ కళ్యాణ్ కుమార్ ప్రసంగించారు. నిర్మలా కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ అమలరాణి, నిర్మల హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ సిస్టర్ డాక్టర్ బిందు ఫిలిప్, కన్య స్త్రీలు, ఉపదేశలు, సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

వేకువజాము నుంచే ప్రార్థనలు

బుట్టాయగూడెం: మండలంలో గుడ్‌ఫ్రైడేను అత్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాల్లో వేకువ జామునే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శిలువ మోస్తూ ప్రదర్శనలు చేశారు. సర్వమానవుల పాపాల కోసం యేసు తన రక్తాన్ని పణంగా పెట్టారంటూ చర్చి ఫాదర్లు పేర్కొన్నారు. అదేవిధంగా జీలుగుమిల్లి మండలంలో కూడా గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. దర్భగూడెం ఫాదర్ అత్తయ్య, సహాయ గురువులు జోసఫ్ తంబి ఆధ్వర్యంలో పశ్చాత్తాపం ప్రార్థనా కార్యక్రమం జరిగింది. క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు

పోలవరం రూరల్: పోలవరంలోని బైబిల్ మిషన్ సింధూర మందిరంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ ఎలిపే దమానియేల్ ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. గార్లగొయ్యి గ్రామంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం శిలువ యాత్రను నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రాణ త్యాగం చేసిన రోజు అని తెలిపారు. పాస్టర్ పీజే సుధాకర్ దైవసందేశం వినిపించారు. దైవ సేవకురాలు ఎలిపే పరంజ్యోతి, సైనీ ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు గీతాలాపనలతో ర్యాలీ

కొయ్యలగూడెం: గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం గవరవరం ఆర్‌సీఎం చర్చ్ విచారణ గురువులు అంకాలగూడెం గ్రామం నుంచి కొయ్యలగూడెం గ్రామం మీదుగా శిలువ యాత్ర నిర్వహించారు. శిలువ మోస్తూ గవరవరం ఆర్‌సీఎం చర్చి వరకు నాలుగు కిలోమీటర్ల మేర క్రీస్తు గీతాలాపనతో, ప్రబోధనలతో భారీ ర్యాలీ చేశారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన సమయంలో పలికిన ఏడు మాటలకు గాను ఏడుచోట్ల ఆగి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కన్నాపురం, వేదాంతపురం, బయ్యన్నగూడెం, రాజవరం గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు.

శాంతి ర్యాలీలు..

టి.నరసాపురం: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని మండలంలోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు విశేష ప్రార్థనలు నిర్వహించారు. గ్రామాల్లో శిలువ యాత్ర నిర్వహించారు. ఫాదర్ కొప్పుల రాయప్ప, పాస్టర్ జి.జ్ఞాన్ రాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ వేయబడిన రోజును గుడ్ ఫ్రైడేగా క్రైస్తవులు ఆచరిస్తారన్నారు. ప్రకాష్ నగర్‌లో షాలేము ప్రార్థన మందిరం సంఘ విశ్వాసులు శాంతిర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టి.నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లం గ్రామాలలో ఆర్‌సీఎం, సీఎస్ఐ సంఘాల వారు శిలువ మోస్తూ ప్రదర్శన చేశారు. పాస్టర్లు కె.నిరీక్షణరావు, సీహెచ్ హోషేయ, బ్రదర్ అనిల్, సీహెచ్ రమేష్, వై.పాల్ తదితరులు పాల్గొన్నారు.

శిలువ ధారణతో మానవాళికి స్వస్థత

ద్వారకాతిరుమల: ఏసు క్రీస్తు శిలువ ధారణతో మానవాళికి స్వస్థత కలుగుతుందని పంగిడిగూడెం విచారణకర్త ఫాదర్ టోని అన్నారు. పంగిడిగూడెంలో ఆర్‌సీఎం చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా సంఘస్తులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పురవీధుల్లో శిలువ యాత్రలో పాల్గొన్నారు. అలాగే రాళ్లకుంట విచారణలో గుడ్ ఫ్రైడే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మద్దులగూడెం, సీహెచ్.పోతేపల్లి, దొరసానిపాడు, కోడిగూడెం గ్రామాల్లో జరిపిన శిలువ మార్గంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.



టి.నరసాపురంలో శిలువయాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు



చింతలపూడిలో క్రైస్తవ భక్తులకు శీతల పానీయాలు పంపిణీ చేస్తున్న ముస్లింలు



పంగిడిగూడెంలో శిలువ మార్గాన్ని నిర్వహిస్తున్న ఫాదర్ టోని, సంఘస్తులు

అన్నదాతల సేవలో ఆర్బీకేలు

- రైతు భరోసా కేంద్రాల్లో ద్వారా గ్రామాల్లో విస్తృతంగా రైతులకు సేవలు
- కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాల ద్వారా మరింత వేగవంతం
- విత్తు నుంచి పంట అమ్మకం వరకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

జంగారెడ్డిగూడెం: రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. రైతుకు చేయూత అందిస్తేనే వ్యవసాయం పరిఢవిల్లుతోంది. ఇదే తరహాలో ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయంలో సవాళ్లను అధిగమిస్తూ రైతును విజేతగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఆర్‌బీకే (రైతు భరోసా కేంద్రం)లు ఏర్పాటు చేసి రైతుకు అండగా నిలుస్తోంది. గ్రామస్థాయిలోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి విత్తు నుంచి పండిన పంట అమ్ముకునే వరకు ప్రతి దశలోనూ ఆర్‌బీకేల ద్వారా సేవలు అందిస్తోంది. చింతలపూడి నియోజకవర్గంలో ఆర్‌బీకేలకు మౌళిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. చింతలపూడి నియోజకవర్గంలో మొత్తం 75 ఆర్‌బీకేలు నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం ఒక్కొక్క కేంద్రానికి రూ.21.80 లక్షలు చొప్పున మొత్తం 75 భవనాల నిర్మాణం కోసం రూ.16.35 కోట్లు వెచ్చించి నిర్మాణాలు చేపట్టింది.



లింగపాలెం మండలం ముడిచర్లలో రైతు భరోసా కేంద్ర భవనం



కేఎస్ రామవరం ఆర్‌బీకే భవనం



లింగపాలెంలో ఆర్‌బీకే భవనం

అన్ని సేవలు ఆర్‌బీకేల్లోనే

వ్యవసాయంలో ప్రాథమిక దశ నుంచి చివరి దశ వరకు అనగా విత్తనాలతో మొదలుకుని పండిన పంటను రైతు విక్రయించుకునేంత వరకు ప్రతీ సేవను ఆర్‌బీకేల్లో అందిస్తున్నారు. గతంలో రైతులు ఆయా దశల్లో వ్యవసాయ అవసరాలకు ఒక్కొక్క చోటికి వెళ్లాల్సి వచ్చేది. ముఖ్యంగా గ్రామాల్లోని రైతులు తప్పనిసరిగా మండల కేంద్రాలకు వెళ్లాల్సిందే. దీంతో రైతులకు వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేది. ఎరువులు, పురుగుమందులు వంటివి లభ్యత కూడా అంతంత మాత్రంగా ఉండటంతో ప్రైవేట్ షాపులను రైతులు ఆశ్రయించాల్సి వచ్చేది. దీంతో అధిక ధరలు, రవాణా ఖర్చులు ఇబ్బందులు పడేవారు. రైతులకు వ్యవసాయంలో సాంకేతిక సలహాలు కావాలన్నా అంతగా లభించేవి కావు. ఈ అవస్థల నుంచి రైతులను గట్టెక్కించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాల సేవలను గ్రామ స్థాయిలో అందిస్తున్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయంలో మెలకువలు తెలపడం, వాతావరణ పరిస్థితులు దృష్ట్యా ఏ పంట వేయాలి, ఏ ఎరువు వేయాలి, పంటను ఎలా ఒబ్బిడి చేసుకోవాలి. ఎక్కడ పంటను విక్రయించుకోవాలి, అధిక దిగుబడి రావడానికి చేపట్టాల్సిన చర్యలు, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, పంట నష్ట బీమా, పెట్టుబడి సహాయం, యాంత్రీకరణ ఇలా అనేక సేవలు ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను వివిధ రాష్ట్రా ప్రతినిధులు ఇక్కడకు వచ్చి అధ్యయనం చేయడం, ఆర్‌బీకేలను సందర్శించి అందిస్తున్న సేవలను తెలుసుకోవడం వైఎస్సార్‌సీపీ సాధించిన ఘనవిజయంగా చెప్పుకోవచ్చు.

నియోజకవర్గంలో ఆర్‌బీకేల నిర్మాణ వివరాలు	
మొత్తం భవన నిర్మాణాలు	75
వ్యవసాయ శాఖకు అప్పగించినవి	27
నిర్మాణం పూర్తయిన భవనాలు	20
తుది దశలో ఉన్నవి	7
శ్లాబ్ లెవల్‌లో ఉన్నవి	4
రూఫ్ లెవల్‌లో ఉన్నవి	13
బేస్‌మెంట్‌లెవల్‌లో ఉన్నవి	3
ఇంకా నిర్మాణాలు ప్రారంభించాల్సినవి	1

ఆర్‌బీకేల నిర్మాణం ఇలా..

రైతులు సమావేశాలు నిర్వహించుకోవడానికి సమావేశ మందిరం, సిబ్బంది సేవలు అందించేందుకు రెండు గదులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రదర్శించేందుకు వీలుగా వరండా నిర్మాణం చేశారు. ఆర్‌బీకేల్లో వివిధ పథకాలకు సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాలు ప్రదర్శనతో పాటు, భూసార పరీక్షల నమూనాల వివరాలు, రైతుల కోసం వ్యవసాయ లైబ్రరీ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా రైతులు విత్తనాలు, ఎరువులు వంటివి ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన కియోస్కోల ద్వారా బుక్ చేసుకునే వీలు కల్పించింది. వీటి ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఆర్‌బీకేల్లో సేవలు

- కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు మంజూరు
- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచడం
- వైఎస్సార్ పొలంబడి ద్వారా రైతులకు సూచనలు, సలహాలు అందించడం
- సమస్యలు గుర్తించేందుకు ప్రతినెలా గ్రామ సభలు
- పొలం బడి కార్యక్రమం నిర్వహణ ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేలా చైతన్యవంతం చేయడం
- పంట కోత ప్రయోగాలు, పంట నష్టపోతే బీమా అంచనాలు ప్రభుత్వానికి నివేదించడం
- పంట నమోదు ద్వారా ఉచిత పంటల బీమా, సున్న వడ్డీ రుణాలు అందించడం
- అర్హులైన రైతులకు రైతు భరోసా, పీఎం కిసాన్, కౌలు రైతు భరోసా పథకాల నమోదు
- ధాన్యం కల్లం వద్ద నుంచి మిల్లుకు చేరే వరకూ దళారుల బెడద లేకుండా రైతులకు సహకారం

నూకాలమ్మ రజత వస్త్రానికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారు శుక్రవారం విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీజలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మహా మంత్ర పుష్పం, సాయం సంధ్యాహారతి పూజలు ప్రధాన అర్చకులు మనోజ్ శర్మ నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి రజత వస్త్రం తయారీకి అన్నపూర్ణ డీజే ఫ్యాషన్స్ సత్తిబాబు, వీరమణి కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని, అంటియాకుల శ్రీకాంత్ రేణుక దంపతులు 5 తులాల వెండిని సమర్పించారన్నారు. అలాగే వల్లభనేని అనంతలక్ష్మి కుమారుడు సురేంద్ర ఆలయ అభివృద్ధికి రూ.5,116 సమర్పించారన్నారు. పట్టణ ప్రముఖులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి రజత వస్త్రం నిమిత్తం వెండిని సమర్పిస్తున్న భక్తులు

ఎన్నికల నియమావళిని పాటించండి

పెదపాడు: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఏలూరు డీఎస్పీ లక్ష్మయ్య తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పెదపాడులో గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో 18 ఏళ్లలోపు వారిని వినియోగించరాదన్నారు. ప్రతి ఒక్కరూ రూ.50వేలు మించి నగదును తమ ప్రయాణ సమయంలో వెంట పెట్టుకుని రాకూడదని చెప్పారు. రాజకీయ చిహ్నాలు, రాజకీయ జెండాలు, వాహనాలపై కలిగి ఉండరాదన్నారు. జెండాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా అనుమతులను పొందాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 144సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో సమావేశాలు సభలు నిర్వహించుకోవాలంటే ముందస్తు అనుమతులు పొందాలని చెప్పారు. సోషల్ మీడియాపై నిఘా ఉందని, ఎదుటివారికి అవమానం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

'ఆర్యవైశ్యులకు నిస్వార్థంగా సేవలందిస్తా'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్య వైశ్య కల్యాణ మండపం ట్రస్ట్ సంయుక్త కార్యదర్శిగా నగరానికి చెందిన ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మోటమర్రి సదానంద కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్ బొండాడ రామ మోహనరావు (రాంపండు) సదానంద్‌కు నియామకపత్రం అందజేశారు. వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2026వ సంవత్సరం ఫిబ్రవరి 11 వరకు సదానంద్ ఈ పదవిలో కొనసాగుతారని రాంపండు పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు నిస్వార్థంగా సేవలందించే అవకాశం ఈ ట్రస్ట్ ద్వారా తనకు లభించడం పూర్వ జన్మ శుకృతంగా భావిస్తున్నానని, భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాల్లో భాగస్వామినై ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తానని సదానంద్ తెలిపారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం గుడివాకలంకలో ఈనెల 30న ప్రారంభమైన శ్రీకోదండరామ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఏటా జరిగే ఈ పోటీలు 30వ తేదీన ముగుస్తాయి. కొల్లేరు గ్రామాల జట్లు మాత్రమే పాల్గొంటాయి. నాకౌట్ విధానంలో తలపడి విజయం సాధించిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. శుక్రవారం సాయంత్రం స్థానిక బీసీ కాలనీలోని వాలీబాల్ కోర్టులో దేవీచింతపాడు, శివరావుపాడు జట్లు తలపడ్డాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో మ్యాచ్‌ను ఆసక్తిగా తిలకించారు. శనివారం నిర్వహించే ఫైనల్‌లో గెలుపొందిన జట్టుకు రూ.35 వేల బహుమతితో పాటు ట్రోఫీ, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.25 వేలు, తృతీయ స్థానానికి రూ.15 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.